క్లుప్తంగా

రూ.3.5 లక్షల విరాళం



చెక్కు అందజేస్తున్న కొర్లకుంట గురునాథరెడ్డి

చంద్రగిరి: చంద్రగిరి గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్ నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం రామచంద్రాపురం మండలం రేకల చేనుకు చెందిన కొర్లకుంట గురునాథరెడ్డి రూ.1,11,116ను చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డికి అందజేశారు. అదే విధంగా అమెరికాలో ఉంటున్న ప్రవాసాంధ్రుడు డాక్టర్ సోమశేఖర్ నాయుడు, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ శరణ్ రెడ్డి చెరో రూ.లక్ష, ఐతేపల్లికి చెందిన వంశీధర్ రూ.50 వేలు ఇచ్చారు. ఇప్పటి వరకు రూ.41.5 లక్షల విరాళాలు వచ్చినట్టు తెలిపారు. రామచంద్రాపురం ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్‌స్వామి, ఈఓ రామకృష్ణారెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

మూలస్థాన ఎల్లమ్మ హుండీ ఆదాయం రూ.6.72 లక్షలు

చంద్రగిరి: గ్రామ దేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.6,72,845 వచ్చినట్లు చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆలయ ఆవరణలో సోమవారం నవంబర్ 11 నుంచి సోమవారం వరకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను అన్నమయ్య జిల్లా దేవదాయ శాఖ అధికారి చాట్ల విశ్వనాథ్ పర్యవేక్షణలో లెక్కించారు. చైర్మన్ మాట్లాడుతూ 75 రోజుల్లో రూ.6,72,845 వచ్చిందని, ఇది గతంలో కంటే ఎక్కువని తెలిపారు. కార్యక్రమంలో ఈఓ రామకృష్ణారెడ్డి, సప్తగిరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, రెవెన్యూ, పోలీసు అధికారులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో యువకుల హల్‌చల్



రోడ్డులో గుమికూడిన యువకులు

చంద్రగిరి: తిరుపతి రూరల్ మండలం ఉప్పరపల్లికి చెందిన ఒక యువకుడి జన్మదిన వేడుకలను సోమవారం చంద్రగిరిలో నిర్వహించారు. 200 మంది యువకులు బైక్‌ల్లో ర్యాలీగా జాతీయ రహదారి వద్దకు చేరుకున్నారు. అక్కడ కేకలు వేస్తూ, బాణసంచా పేల్చి హంగామా చేశారు. మరికొంత మంది యువకులు బైక్ సైలెన్సర్లు తీసేసి భారీగా శబ్దం చేస్తూ పోలీసు స్టేషన్ మీదుగా ర్యాలీ చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు జాతీయ రహదారి వద్దకు చేరుకుని వారిని చెదరగొట్టారు.

వికలాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ



తిరుపతి కల్చరల్: ఏక వీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామి తిరుపతి జిల్లాలోని సుమారు 200 మంది వికలాంగులకు కృత్రిమ కాళ్లు, చేతులు అందజేయాలని సంకల్పించారు. ఇందులో భాగంగా నరసింహ తీర్థం రోడ్డులోని పద్మావతి మహిళా ప్రార్థన ప్రాంగణంలో సోమవారం ఉచిత కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం మంగళ, బుధవారాలు కూడా నిర్వహిస్తామని ప్రతాప్ స్వామి తెలిపారు. కృత్రిమ అవయవాలు అవసరమైన వారు తమను సంప్రదించాలని కోరారు. ఎస్వీయూ మాజీ వీసీ రాళ్లపల్లి రామ్మూర్తి, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో ఇద్దరికి రిమాండ్

తిరుపతి లీగల్ : తిరుమల శ్రీవారి రూ.300ల దర్శన టికెట్లను బ్లాక్‌లో అధిక ధరకు విక్రయించి భక్తులను మోసం చేసిన కేసులో ఇద్దరికి 14 రోజులు రిమాండ్ విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు సోమవారం ఉత్తర్వులిచ్చారు. పాకాల మండలం గాదంకికి చెందిన సి.నాగభూషణం, పెద్దపంజాణి మండలం చిల్లావారిపల్లికి చెంది ప్రస్తుతం తిరుపతి సుబ్బారెడ్డినగర్‌లో ఉంటున్న గంగారం రాజన్న హైదరాబాద్‌కు చెందిన ఒక భక్తురాలికి శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ.300లు) నాలుగు టికెట్లను రూ.12 వేలకు విక్రయించారు. భక్తురాలి ఫిర్యాదు మేరకు టీటీడీ విజిలెన్స్ అధికారులు ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

శేషాచలంలో కొనసాగుతున్న కూంబింగ్

భాకరాపేట: శేషాచలం అడవుల్లోకి తమిళ స్మగ్లర్లు పెద్ద సంఖ్యలో చేరుకున్నట్టు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్, అటవీ, పోలీసు అధికారులు కూంబింగ్ చేపట్టారు. అన్నమయ్య జిల్లా బాలపల్లె ఫారెస్టు, సుండుపల్లె మండలం ఫింఛా ప్రాజెక్టు, తిరుపతి జిల్లా శ్రీవారి మెట్టు మార్గం, రేణిగుంట మండలం చైతన్యపురం నుంచి అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. భాకరాపేట రేంజర్ దత్తాత్రేయ మాట్లాడుతూ శేషాచలం అడవుల ఉట్టూ పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. తమిళ స్మగ్లర్లను పూర్తి స్థాయిలో నిరోధించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు.



పూల పరిమళానికి పులకరించని వారు ఉండరు. అందుకే పూమాలకు తలవంచని ధీమంతుడెవడు అని ఒక కవి అన్నారు. ఆధ్యాత్మిక నగరం తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల రోడ్డు, రాస్ బిల్డింగ్ వద్ద ఉన్న టర్బుయా రోసి పింక్ చెట్లు ఎర్రటి పూలను విరబూసి చూపరుల హృదయాలను రంజింపజేస్తున్నాయి. ఇవి జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే పూలు పూస్తాయి. అటుగా నడుచుకుంటూ వెళ్లే వారు ఆ చెట్లలోని పూలను చూసి ఆనందం వ్యక్తం చేస్తూ సెల్ఫీలు, మొబైల్‌లో ఫొటోలు తీసుకుంటున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ఫిబ్రవరి 15 నుంచి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి అలిపిరి: తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయంలో ఫిబ్రవరి 15 నుంచి 19వ వరకు మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు పాలక మండలి చైర్మన్ ఉమా మహేశ్వర్‌రెడ్డి, ఈవో జయకుమార్ తెలిపారు. వారు సోమవారం తుమ్మలగుంటలో ఉత్సవాల కరపత్రాలు, పోస్టర్లను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి ఉత్సవాలపై అధికారులు, పాలక మండలి సభ్యులతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. తిరుపతి, పీలేరు, రాయచోటి ప్రాంతాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపడం, సొంత వాహనాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రత్యేక కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించాలని ఈవో జయకుమార్‌ను ఆదేశించారు. మాజీ చైర్మన్ రేవతి రెడ్డెప్పరెడ్డి సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

దుకాణాలకు వేలం

తలకోనలో ఏడాదిపాటు దుకాణాలను అద్దెకు ఇచ్చేందుకు ఫిబ్రవరి ఒకటిన వేలం నిర్వహించనున్నట్లు ఈవో జయకుమార్ తెలిపారు. షాపు నెం 1, 5, పాదరక్షలు భద్రపరిచే హక్కుకు వేలంపాట వుంటుందన్నారు. పాటదారులు ముందుగా రూ.5 వేలు దరావతు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

పాకాల : మండలంలోని రవణప్పగారిపల్లిలో మృతిచెందిన గురుస్వామిగౌడ్(75) కుటుంబ సభ్యులకు సోమవారం ఈడిగ గౌడ సంఘం అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్ రూ.7500లు సాయం అందించారు. ఆయన సంఘం సభ్యులతో కలిసి మృతుని ఇంటి వద్దకు చేరుకున్నారు. మృతదేహంపై పూల మాలలు వేసి నివాళులర్పించారు. మృతుని భార్య డి.లక్ష్మమ్మను పరామర్శించారు. సంఘం సభ్యులు శ్రీనివాసులు, నాగరాజు, దొరరాజు, నాగేశ్వర్ రావు, చెంగల్రాయుడు పాల్గొన్నారు.

ఓటమి గెలుపునకు నాంది



క్రికెట్ వ్యాఖ్యాత వెంకటేష్‌ను సత్కరిస్తున్న సునీల్‌కుమార్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : ఓటమి గెలుపునకు నాంది అని, ఓటమి నేర్పే పాఠంతో గెలుపునకు బాటలు వేసుకోవాలని క్రికెట్ వ్యాఖ్యాత, క్రీడా విశ్లేషకులు సి.వెంకటేష్ తెలిపారు. తిరుపతిలోని రెడ్ చెర్రీస్ పాఠశాలలో సోమవారం విద్య, క్రీడల మధ్య సమన్వయం అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యవక్తగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ తమకు నచ్చిన క్రీడలు ఆడాలన్నారు. క్రీడల ద్వారా మానసిక, శారీరక ఉల్లాసంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. ఆయన్ను పాఠశాల డైరెక్టర్ సునీల్‌కుమార్‌రెడ్డి ఘనంగా సత్కరించారు.

పకడ్బందీగా ఈ-క్రాప్ బుకింగ్

రామచంద్రాపురం: ఈ-క్రాప్ బుకింగ్ పకడ్బందీగా నిర్వహించినట్లు జేసీ బాలాజీ తెలిపారు. ఆయన సోమవారం జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు, తహశీల్దార్ చిన్న వెంకటేశ్వర్లుతో కలిసి పీవీపురం, కేకేవీపురం, సొరకాయలపాలెం గ్రామాల్లో ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. ఆయన ఈ- క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ-క్రాప్ బుకింగ్ ఆధారంగానే ప్రభుత్వం అందించే సబ్సిడీలు పొందవచ్చని తెలిపారు. ఏఓ స్రవంతి, వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ

తిరుపతి అలిపిరి: ఎర్రావారిపాళెంకు చెందిన మోహన్‌కుమార్, కుసుమకు పెళ్లి నిశ్చయమైంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లికానుక పంపించారు. వరుడు మోహన్‌కుమార్‌కు పెళ్లి కానుకను సోమవారం గ్రామపెద్దలు అందజేశారు.

మహాత్మా గాంధీకి ఘన నివాళి



అన్నదానం చేస్తున్న ట్రస్ట్ చైర్మన్ పీసీ.రాయల్

తిరుపతి కల్చరల్: గాంధీజీ వర్ధంతిని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈస్ట్ పోలీస్ స్టేషన్ సర్కిల్లోనున్న గాంధీ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, సుబ్రమణ్యం యాదవ్, శోభ, చెంగారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, మస్తాన్, దీపక్, కవిత పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ నేత మాంగాటి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

గాంధీ వర్ధంతి సందర్భంగా డాక్టర్ వైఎస్ఆర్ ప్రజా ప్రస్థానం ట్రస్ట్ కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ.రాయల్ గాంధీ రోడ్డులోని తమ కార్యాలయం వద్ద పేదలకు అన్నదానం చేశారు. అంతకు ముందు గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కస్తూర్బా గాంధీ ట్రస్ట్ డైరెక్టర్ రుద్రరాజు శ్రీదేవి, బండి మధుసూదన్‌రెడ్డి, బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి, కొత్తపల్లి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యాన్ని భావితరాలకు అందించాలి



మాట్లాడుతున్న వీసీ కె.రాజారెడ్డి

తిరుచానూరు: తెలుగు భాషా సాహిత్యాన్ని భావితరాలకు అందించి సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని ఎస్వీయూ వీసీ కె.రాజారెడ్డి తెలిపారు. ఎస్వీయూలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో మైసూరు భారతీయ భాషల అధ్యయన కేంద్రం ఆర్థిక సహకారంతో తెలుగు బోధన, ప్రశ్నావళిని రూపొందించడం, మూల్యాంకనం చేయడం తదితర అంశాలపై ఐదు రోజుల వర్క్‌షాపును సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పోతన కవిత్వంలోని మాధుర్యం, వేమన పద్యాల్లోని తాత్త్వికత, అన్నమయ్య కీర్తనల్లోని ఆధ్యాత్మికత మేళవింపు తెలుగు సాహిత్య వైభవానికి సంకేతమన్నారు. భారతీయ భాషల అధ్యయన కేంద్రం అధికారి పంకజ్ ద్వివేది, నేషనల్ టెస్టింగ్ సర్వీస్ ప్రతినిధి బి.బీ రేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు మంచి విజ్ఞానాన్ని అందించేందుకు ముందుగా ఉపాధ్యాయులను ప్రస్తుత పరిస్థితులకు అనుకూలంగా తయారు చేసుకోవాలన్నారు. అకడమిక్ అడ్వైజర్ ప్రొఫెసర్ పేట శ్రీనివాసులురెడ్డి, తెలుగు విభాగాధిపతి ఆర్.రాజేశ్వరమ్మ, వర్సిటీ తెలుగు విభాగ ప్రొఫెసర్ కడియాల వెంకటరమణ, సీఐఐఎల్ ప్రతినిధులు పీఆర్ హరినాథ్, ఆర్.శకుంతల, ఎం.నారాయణరెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్లు మేడిపల్లి రవికుమార్, ఉగ్రాణం చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్, కమిషనర్

తిరుపతి తుడా : స్పందన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉందని మేయర్ శిరీష తెలిపారు. ఆమె సోమవారం కమిషనర్ హరికృష్ణ, వివిధ శాఖాధిపతులతో కలసి స్పందన, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలు చేపట్టారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. యూడీఎస్ మ్యాన్‌హోల్, ఓవర్‌ఫ్లో, కాలువలు బ్లాక్ కావడం, చెత్త తొలగింపు, అసంపూర్తిగా వదలివేసిన అభివృద్ధి పనులపై వచ్చే ఫిర్యాదులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. పరిష్కరించలేని సమస్యలు వుంటే సంబంధిత కారణాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

కుష్టువ్యాధిపై అవగాహన అవసరం

చంద్రగిరి: కుష్టువ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కొటాల పీహెచ్‌సీ డాక్టర్ శివాజీ ప్రయాగ్ తెలిపారు. ఆయన సోమవారం వైద్య సిబ్బందితో కలిసి స్థానిక టవర్‌క్లాక్ నుంచి అవగాహన ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ప్రారంభ దశలోనే కుష్టువ్యాధిని గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ ఈశ్వరయ్య, సిబ్బంది రత్నమ్మ, గణేష్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కుష్టు రహిత సమాజాన్ని నిర్మిద్దాం

రామచంద్రాపురం: కుష్టు రహిత సమాజాన్ని నిర్మిద్దామని కుప్పంబాదూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ పూర్ణ తెలిపారు. ఆమె సోమవారం కుప్పంబాదూరు ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి కుష్టువ్యాధిపై అవగాహన ర్యాలీ చేపట్టారు. నల్లని, తెల్లని మచ్చలు, కనుబొమ్మలు, చెవులు, చర్మంపైన స్పర్శ లేకుండా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

చోరీ కేసుల్లో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్ : మూడు చోరీ కేసుల్లో శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం కాకటూరుకు చెందిన బి.పవన్‌కు ఒక్కొక్క కేసులో మూడు నెలల జైలు శిక్ష, రూ.100 చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు సోమవారం తీర్పు చెప్పారు. తమిళనాడుకు చెందిన భక్తురాలు 2015 జూన్ 11న తిరుమల మాధవ నిలయం వద్ద ఉండగా రూ.84 వేల విలువైన బంగారు నగలు చోరీ అయ్యాయి. 2016 మే 15న బెంగళూరుకు చెందిన భక్తులు తిరుమలలోని జీఎన్‌సీ–512బి గదిలో నిద్రించగా మొబైల్ ఫోన్, ఏటీఎం కార్డు చోరీ అయ్యాయి. ఏటీఎం కార్డును ఉపయోగించి రూ.37 వేలను డ్రా చేశారు. అదేవిధంగా 2017 మార్చి 11న బెంగళూరుకు చెందిన ఒక భక్తుడు సీఆర్వో ఆఫీసు సమీపంలో కార్ పార్కింగ్ చేశాడు. కారులో ఉన్న రూ.25 వేల విలువైన సెల్‌ఫోన్, ఇతర వస్తువులు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు తిరుమల సీసీఎస్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు పవన్‌తో పాటు మరొకరిపై కేసు నమోదు చేశారు. న్యాయమూర్తి కేసులను పరిశీలించి నిందితుడు పవన్‌కు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. మరో వ్యక్తికి కోర్టు ఇదివరలోనే శిక్ష విధించింది.

కళలను భావితరాలకు అందించాలి

తిరుపతి కల్చరల్: భారతీయ కళా సంపదను భావితరాలకు అందించి కళా విశిష్టతను విస్తృతం చేయాలని పద్మావతి మహిళా వర్సిటీ మ్యూజిక్ విభాగం హెచ్‌వోడీ ద్వారం లక్ష్మి పిలుపునిచ్చారు. మహతి కళాక్షేత్రంలో సోమవారం రాత్రి భరత కళాక్షేత్రం వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఎస్వీ సంగీత కళాశాల భరతనాట్యం హెచ్‌వోడీ ఎం.ఉమా ముద్దుబాల, సినీ గాయకుడు నిహాల్ మాట్లాడుతూ పిల్లలకు విద్యతో పాటు సంస్కారం, సంప్రదాయ కళలపై మక్కువను కలిగించాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

డ్రాయింగ్ పోటీల్లో మొదటి బహుమతి



మొదటి బహుమతి సాధించిన హరిప్రియ

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి మహతి ఆడిటోరియంలో ఆదివారం భరత్ కళా క్షేత్ర ఆధ్వర్యంలో డ్రాయింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు హథీరాంజీ కాలనీలోని చైతన్య భారతి పాఠశాల 7వ తరగతి విద్యార్థిని సి.హరిప్రియ పాల్గొని మొదటి బహుమతి సాధించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ కె.జనార్ధనరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

ఘాట్ రోడ్డులో ప్రమాదం

తిరుమల: తిరుమల నుంచి తిరుపతికి వెళ్లే మొదటి ఘాట్ రోడ్లో సోమవారం కారు పిట్ట గోడను ఢీకొంది. కర్ణాటక చెందిన భక్తులు తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. డ్రైవర్ రెండో మలుపు వద్ద కారును అదుపు చేయలేక పక్కనే ఉన్న పిట్టగోడపైకి ఎక్కించాడు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఘాట్ రోడ్డు సిబ్బంది వాహనాన్ని పక్కకు తొలగించారు.

యువతతోనే దేశాభివృద్ధి



విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమని, ఆ దిశగా యువత కృషి చేయాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతి రీజనల్ సైన్స్ సెంటర్‌లో ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం, తిరుపతి ఆర్ట్స్ సొసైటీ, తిరుపతి నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియమ్స్, సాంస్కృతిక మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన గణతంత్ర దినోత్సవాలు సోమవారం ముగిశాయి. ఇందులో భాగంగా తిరుపతి ఆర్ట్ సొసైటీ (టీఏఎస్)తో కలిసి తెలుగు రాష్ట్రాల స్వాతంత్య్ర సమరయోధుల పోర్ట్రెయిట్ పెయింటింగ్స్ ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. 73 మంది కళాకారులు 133 మంది స్వాతంత్య్ర సమరయోధుల పోర్ట్రెయిట్ పెయింటింగ్స్‌ను ప్రదర్శించారు. ఎమ్మెల్యే భూమన స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు వేసిన పెయింటింగ్‌లను పరిశీలించారు. గాంధీలోని శాంతి, నిజాయితీ, క్రమశిక్షణ, క్షమాగుణం ప్రతి విద్యార్థిలోనూ ఉండాలన్నారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి, సాహితీవేత్త సాకం నాగరాజు, తిరుపతి ఆర్ట్స్ సొసైటీ నిర్వాహకులు హేమాక్షి ఆచారి, బాలాజీ, పురుషోత్తం పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు

- రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి
- గడప గడపకూ మహాపాదయాత్రలో ఎంపీపీ మోహిత్ రెడ్డి
- చిగురువాడ పంచాయతీ అభివృద్ధికి కృషి



చిగురువాడలో ఎంపీపీ మోహిత్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

తిరుపతి రూరల్: ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం చిగురువాడ పంచాయతీలో గడప గడపకూ మహా పాదయాత్ర నిర్వహించారు. ఆయనకు సర్పంచ్ ముచ్చేలి ప్రదీప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా కొత్తూరు మాతమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతిగడపకూ వెళ్లి వారు పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. పంచాయతీలో వైఎస్సార్ కాలనీకి చెందిన అగ్గిపెట్టె మచ్చాగా పిలువబడే కాకి కిరణ్ కుమార్ ఎంపీపీ పలకరించారు. ప్రభుత్వం అందించే పథకాల లబ్ధి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి కలిగినట్టు తెలిపారు. 2014, 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యే చెవిరెడ్డికి భారీ ఆధిక్యాన్ని అందించిన పంచాయతీ చిగురువాడ అని పేర్కొన్నారు. ఇక్కడి ప్రజలకు రుణపడి ఉంటామని స్పష్టం చేశారు. పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడించారు. గడిచిన మూడేళ్ల కాలంలో పంచాయతీలో రూ.4.38 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. మాజీ ఎంపీపీ చిలమంద మునికృష్ణ, మాజీ జెడ్పీటీసీ సుధాకర్, వేదాంతపురం, అవిలాల, లింగేశ్వర్‌నగర్ సర్పంచులు చిరంజీవి రెడ్డి, రమణ, కోటేశ్వర రావు, మల్లవరం శ్రీరాములు, వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి, ఉప సర్పంచ్ మోహనరామిరెడ్డి, ఎంపీటీసీ వేమూరు కవిత, సుధాకర్ రెడ్డి, ధరణీ కుమార్ రెడ్డి, మునికృష్ణారెడ్డి, సోమశేఖర్, శరత్ పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు



ప్రథమ స్థానం సాధించిన కడప జిల్లా జట్టు

తిరుపతి ఎడ్యుకేషన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాలబాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ముగిశాయి. ఇందులో వివిధ జిల్లాల నుంచి 12 బాలుర, 8 బాలికల జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో వైఎస్సార్ కడప జిల్లా ప్రథమ, కర్నూలు, అనంతపురం జిల్లా జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో అనంతపురం జిల్లా ప్రథమ, తూర్పుగోదావరి, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. తిరుపతి జిల్లా ఇంటర్ బోర్డు అధికారి ఎ.స్వర్ణలత ఆయా జట్లకు ట్రోఫీలు, బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే ఉత్తమ ప్రతి భ కనబరచిన 18 మంది బాలురు, 18 మంది బాలి కలను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. ఏప్రిల్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఈ జట్లు పాల్గొననున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్–19 కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.జయరామయ్య తెలిపారు. ఎస్‌జీఎఫ్ పరిశీలకులు సునీల్‌దత్ నాయక్, చెంచయ్య, శివరామకృష్ణ, వినోద్, సాయి, అచ్యుత్ పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకం



స్వచ్ఛంద సంస్థ ప్రతినిధిని సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: గ్రామీణాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమని వినియోగదారుల ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు రాజారెడ్డి తెలిపారు. గాంధీ వర్ధంతి సందర్భంగా విశ్వంభర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామీణాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు వినియోగదారుల హక్కుల రక్షణలో చొరవ తీసుకొని సేవలు అందించాలని కోరారు. రాస్ ప్రతినిధి మోహన్ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా సేవ చేస్తే తప్పక ప్రతిఫలం ఉంటుందన్నారు. అనంతరం విశ్వంభర చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సువర్ణ కుమారి ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు భారతీయ విశ్వసేవా పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఎస్వీయూ విశ్రాంత ప్రిన్సిపాల్ రెడ్డెప్పరెడ్డి, ఆయుర్వేద వైద్యుడు జగన్నాథ్, భారతీయ సేవా సంస్థ నిర్వాహకులు రాజా, భారతి, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

సంక్షేమ చట్టం సాధన కోసం పోరాటాలు

తిరుపతి కల్చరల్: సంక్షేమ చట్టం సాధన కోసం హమాలీ కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్, హమాలీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. సీపీఐ కార్యాలయంలో సోమవారం హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మూడవ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీని ప్రకటించారు. యూనియన్ రాష్ట్ర చైర్మన్‌గా చల్ల చిన్న ఆంజనేయులు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా ఎస్.వెంకటసుబ్బయ్య, అధ్యక్షుడిగా ఎం.సాంబశివరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్‌డీ.రవి, ప్రధాన కార్యదర్శిగా ఎం.మన్మథరావు, డెప్యూటీ ప్రధాన కార్యదర్శిగా రావుల అంజిబాబు, ఉపాధ్యక్షులుగా వీకే.కృష్ణుడు, రమణయ్య, చంద్రశేఖర్ నాయుడు, నాంచారయ్య, మునయ్య, సహాయ కార్యదర్శులుగా అబ్బాస్, సీహెచ్.వెంకటేశ్వర్లు, కె.రాంబాబు, రామచంద్రమూర్తి, కోఠారి రమణ, కోశాధికారిగా ఎం.మహేష్ ఎన్నికయ్యారు.

తిరుపతిలో పాప్ కార్న్ చిత్రం యూనిట్ సందడి



మాట్లాడుతున్న పాప్ కార్న్ చిత్రం హీరో సాయి రోనాక్

తిరుపతి కల్చరల్: పాప్ కార్న్ చిత్రం సరికొత్త ట్రెండ్ జోనర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందని హీరో సాయి రోనాక్ తెలిపారు. ఆచార్య క్రియేషన్స్ ఆధ్వర్యంలో మురళి గంధం దర్శకత్వంలో రూపొందించిన పాప్ కార్న్ ఫిబ్రవరి 10న విడుదల కానుంది. చిత్రం ప్రమోషన్‌లో భాగంగా యూనిట్ సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకుని ఎంఆర్ పల్లి, న్యూబాలాజీ కాలనీలోనున్న ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలకు వచ్చింది. హీరో సాయి రోనాక్, హీరోయిన్ అవికా గోర్ మీడియాతో మాట్లాడుతూ పాప్ కార్న్ మంచి లవ్‌స్టోరీ సినిమా అని తెలిపారు. దర్శకుడు మురళి గంధం మాట్లాడుతూ ఇప్పటి వరకు అనేక ప్రేమ కథా చిత్రాలు వచ్చాయని, తాము నిర్మించిన ఈ చిత్రం డిఫరెంట్ జోనర్‌లో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకునేలా ఉంటుందని తెలిపారు. ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్ చక్రవర్తిరెడ్డి మాట్లాడుతూ తిరుమల శ్రీవారి ఆశీస్సులతో ఈ చిత్రం మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. చిత్రం నిర్మాతలు చలపతి, భోగేంద్ర గుప్త తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి టీటీడీ ఉద్యోగుల క్రీడలు

తిరుపతి అలిపిరి : ఫిబ్రవరి 2 నుంచి 19 వరకు టీటీడీ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు సంక్షేమ విభాగం డిప్యూటీ ఈవో స్నేహలత తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

75 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : మద్యంతాగి వాహనాలు నడపడం, పబ్లిక్ స్థలంలో డబ్బుపెట్టి పేకాట ఆడడం వంటి నేరాలకు పాల్పడిన 75 మందికి రూ.86,850 జరిమానా విధిస్తూ తిరుపతి మొదటి ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ సుబ్బలక్ష్మి సోమవారం తీర్పు చెప్పారు.